క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భువనగిరి : పట్టణంలోని కృష్ణ జ్యూయలర్స్ నుంచి పాత బస్టాండ్ వరకు గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ పట్టణ ఏఈ సాయికృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త ఎల్‌టీ లైన్ వేడయంతో పాటు డీపీఆర్ మార్పు చేసే పనుల్లో భాగంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఆర్బీనగర్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. పాత బస్టాండ్, శృతినగర్, ఎస్ఎల్ఎన్ఎస్ డిగ్రీ కళాశాల, సంతోష్‌నగర, పెంటాజీనగర్, ఠాగూర్‌రోడ్, సంజీవనగర్, హన్మాన్‌వాడ ఏరియాలో బంపర్లు, బ్యాక్ పిడింగ్ మార్పు చేసే సమయంలో ఉదయం, సాయంత్రం సమయాల్లో గంట పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. వినియోగదారులు సర్వీస్‌లను కొత్త ఎల్‌టీ లైన్‌కు మార్పు చేసేందుకు కొత్త సర్వీస్ వైరు సిద్ధంగా ఉంచుకోవాలని కోరారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పడే విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

దేవాలయ హుండీ లెక్కింపు

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని శ్రీ ముత్యాలమ్మ దేవాలయంలో బుధవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. రూ.79,896 ఆదాయం సమకూరిందని ఆలయ కమిటీ అధ్యక్షుడు సందగళ్ల సతీష్ తెలిపారు. కార్యక్రమంలో లింగస్వామి, శివనాగరాజు, సాయి,ప్రవీణ్, లక్ష్మమ్మ, కమలమ్మ పాల్గొన్నారు.

అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలి

చౌటుప్పల్ : రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం తక్షణమే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియా రాజు డిమాండ్ చేశారు. పట్టణ కేంద్రంలోని పలు ప్రైవేటు కళాశాలల్లో నిర్వహించిన స్వాగత సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కళాశాలల నూతన కమిటీలను ఎన్నుకున్నారు. విద్యారంగం, విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి తీగుళ్ల శ్రీనివాస్, నాయకులు శ్రావణ్, వరుణ్, కిషోర్, సృజన, మాధురి, శ్రీవాణి, కృష్ణ, పవన్, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ

బీబీనగర్ : బీబీనగర్ మండల పరిషత్ కార్యాలయాన్ని బుధవారం జెడ్పీ సీఈఓ శోభారాణి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం కొండమడుగు గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి , తహసీల్దార్ శ్యామ్‌సుందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

భూదాన్‌పోచంపల్లి : హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వచ్చే నెల 3న నిర్వహించనున్న ఎరుకుల హక్కుల పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఎరుకల హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధానకార్యదర్శి బిజిలి కుమార్ అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలో ఎరుకల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దేవరాయ భిక్షపతి, పుడుత శ్రీరాములు, సుధాకర్, కుమార్, కృష్ణ, మానుపాటి యాదయ్య, రాములు, శ్రీకాంత్, నాగేశ్, అంజనేయులు, కిష్టయ్య, జయమ్మ, దేవమ్మ, మహంకాళి, అండాలు, వెంకటేశ్, యాదమ్మ, లలిత పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'డీట్' పోస్టర్ ఆవిష్కరణ

మోటకొండూర్ : నిరుద్యోగుల కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన డీట్ పోర్టల్ పోస్టర్‌ను బుధవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఇందిర, ఈడీసీ మేనేజర్ కుమ్మరికుంట్ల రంజిత్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులకు ఆర్ఏఎంపీ(రైసింగ్ అక్సలరేటింగ్ ఎంఎస్ఎంఈ పెర్ఫార్మెన్స్) ప్రాజెక్ట్ గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగులు ప్రభుత్వం తీసుకొచ్చిన డీట్ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ చంద్రశేఖర్, సూపరింటెండెంట్ యశోద, ఈడీసీ అసిస్టెంట్ మేనేజర్ మహేష్ పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత

భువనగిరిటౌన్ : ప్రభుత్వ ఖాళీ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అంజిరెడ్డి అన్నారు. బుధవారం ఇందిరమ్మ కాలనీలో అక్రమ నిర్మాణాలను పోలీసుల సిబ్బంది కలిసి జేసీబీతో కూల్చివేయించారు. ఈ సందర్భంగా ఆయప మాట్లాడారు. ప్రభుత్వ భూములు ఆక్రమించుకుని నిర్మాణం చేస్తే ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రభుత్వం వివిధ అవసరాల కోసం స్థలం వదిలి వేస్తే వాటిని కొంత మంది ఆక్రమించుకుంటున్నారన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



యాదగిరిగుట్ట - తుర్కపల్లి ప్రధాన రహదారి మధ్యలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

యాదగిరిగుట్ట రూరల్ : యాదగిరిగుట్ట - తుర్కపల్లి మండలాల ప్రధాన రహదారిలో మండలంలోని మల్లాపురం గ్రామ సమీపంలో రోడ్డు మధ్యలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. నిత్యం వందల వాహనాలు ఈ రోడ్డు మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే ఈ రోడ్డును విస్తరించే సమయంలో రోడ్డు మధ్యలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చలేదు. రోడ్డు డివైడర్ మధ్యలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రమాదం పొంచి ఉందని పలువురు వాపోతున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి డివైడర్ మధ్యలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడి నుంచి తరలించాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

ప్రారంభోత్సవానికి సిద్ధం



ప్రారంభోత్సవానికి సిద్ధమైన అగ్నిమాపక కేంద్ర భవనం

యాదగిరిగుట్ట: పట్టణంలోని పాత గోశాలలో నూతనంగా నిర్మించిన అగ్నిమాపక కేంద్ర భవనం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. గురువారం ఈ భవనాన్ని ప్రారంభించనున్నట్లు డీఎఫ్‌వో మధుసూదన్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో అగ్ని మాపక కేంద్ర భవనం ఉండేది. ఏదైనా అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు వాహనం బయటకు వెళ్లేందుకు ఇబ్బందులు తలెత్తుతుండడంతో పాత గో శాలలో ఉన్న స్థలం కేటాయించాలని అగ్నిమాపక అధికారులు గతంలో వైటీడీఏ అధికారులను కోరారు. దీంతో 1ఎకరం 14గుంటల స్థలాన్ని వైటీడీఏ అగ్ని మాపక కేంద్ర భవనం కోసం అప్పగించింది. దీంతో సుమారు రూ.60లక్షలతో 1.10గుంటల్లో అగ్నిమాపక కేంద్రం భవనం, వాహనం పెట్టుకోవడానికి షెడ్డు, చుట్టు ప్రహరీ నిర్మించారు. ఆయా మండలాలకు అందుబాటులో ఉండే విధంగా, ట్రాఫిక్‌కు, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు విశాలమైన స్థలంలో అగ్నిమాపక కేంద్ర భవనాన్ని నిర్మించారు.

ఆరుగ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలం

– డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

ఆత్మకూరు(ఎం) : ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరుగ్యారంటీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాయ మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. ప్రతి గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత ప్రారంభమైందన్నారు. ప్రజలు కేసీఆర్ పాలనను తిరిగి కోరుకుంటున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే అన్నివర్గాల ప్రజలకు మేలు జరిగిందన్నారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటుతుందన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బీసు చందర్ గౌడ్, జిల్లా నాయకులు భాషబోయిన ఉప్పలయ్య, యాస ఇంద్రారెడ్డి, కోరె భిక్షపతి, గడ్డమీది రమేష్ గౌడ్, మాజీ ఎంపీటీసీ యాస కవిత, నాయకులు కోరె వెంకన్న, సోలిపురం అరుణ, సుంచు నాగరాజు, సుంకరి పరుశరాములు, కాలె మల్లేశం పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

● కలెక్టర్ హనుమంతరావు



పాటిమట్లలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు



అడ్డగూడూరు : వెల్దేవి గ్రామంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

మోత్కూరు, అడ్డగూడూరు : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను లబ్ధిదారులు వేగవంతం చేయాలని కలెక్టర్ వి.హనుమంతరావు అన్నారు. మోత్కూరు మండలం పాటిమట్ల, అడ్డగూడూరు మండలం వెల్దేవి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. బేస్మెంట్, పిల్లర్, స్లాబ్ దశలలో పూర్తయిన వెంటనే ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలని హౌసింగ్ ఏఈని ఆదేశించారు. స్లాబ్‌లు పూర్తయిన వారు గృహ ప్రవేశం చేసుకునేలా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అనంతరం కలెక్టర్.. మోత్కూరు అడ్డగూడూరు తహసీల్దార్ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి దరఖాస్తు క్షేత్రస్థాయిలో పరిశీలించి తప్పిదాలకు తావులేకుండా పరిష్కరించాలన్నారు. అడ్డగూడూరు తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల నిర్మాణాలకు భూ సర్వే చేయాలన్నారు. ఆయన వెంట మోత్కూర్, అడ్డగూడూరు తహసీల్దార్లు పి.జ్యోతి, శేషగిరిరావు, అడ్డాగూడూరు ఎంపీడీఓ శంకరయ్య, డీటీ ఉపేందర్ ఉన్నారు.

మహిళా రైతు సమస్య విని..

మోత్కూరు : మోత్కూరు తహసీల్దార్ కార్యాలయ తనిఖీకి వచ్చిన కలెక్టర్‌కు మండలం దత్తప్పగూడెం గ్రామానికి చెందిన బాత్క అయిలమ్మ తన భూ సమస్యను విన్నవించింది. చనిపోయిన తన భర్త మల్లయ్య పేరుమీద ఉన్న 1.22 ఎకరాల భూమిని తన కొడుకు పేరున పట్టా చేయాలని వేడుకుంది. దీనికి స్పందించిన కలెక్టర్.. నీ భర్త పేరుపై ఉన్న భూమి కుమారుడి పేరుపై నేరుగా పట్టా చేయడం కుదరదని, ముందుగా ఫౌతి కింద నీ పేరుపై పట్టా చేయించుకోవాలని, తక్కువగా నమోదైన 22 గుంటల భూమిని కూడా పాస్ పుస్తకంలో ఎక్కించి ఫైల్‌ను తనకు పంపాలని డిప్యూటీ తహసీల్దార్ ఎం.ఉపేందర్‌ను ఆదేశించారు.

ధర్మారెడ్డిపల్లి కాలువ పనుల్లో నాణ్యత పాటించాలి

● ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి



అధికారులు, రైతులతో కలిసి కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి

వలిగొండ : మండలంలోని ధర్మారెడ్డిపల్లి కాలువ పనుల్లో నాణ్యత పాటించి త్వరితగతిన పూర్తిచేసి రైతులకు సాగునీరు అందించాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గోకారం గ్రామం వద్ద నీటిపారుదల శాఖ, విద్యుత్, రెవెన్యూ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం కమీషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టును మాత్రమే నిర్మించారన్నారు. చిన్ననీటి కాలువలను పట్టించుకోలేదన్నారు. అనంతరం ధర్మారెడ్డిపల్లి కాలువ కాలువ పనులను అధికారులు, రైతులతో కలిసి పరిశీలించారు. కాలువ నిర్మాణంలో భూ సేకరణ పనులు శరవేగంగా చేపట్టాలన్నారు. అనంతరం మండలంలోని లింగరాజుపెల్లికి చెందిన గంగదారి ఉపేందర్ గుండెపోటుతో మృతిచెందడంతో స్థానిక ఎమ్మెల్యే పాల్గొని మృతుడికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు మనోహర్, కృష్ణారెడ్డి, చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్ రెడ్డి, తహశీల్దార్ దశరథ, డీఈ మల్లికార్జున్, నాయకులు భీమా నాయక్, నూతి రమేష్, చిట్టెడి జనార్దన్ రెడ్డి, పాశం సత్తిరెడ్డి, తుమ్మల యుగంధర్ రెడ్డి, బాతరాజు బాల్ నర్సింహ, చెరుకు శివయ్య, గూడూరు శ్రీధర్ రెడ్డి, బెలిద నాగేశ్వర్, బోళ్ల శ్రీనివాస్, ఉలిపే మల్లేశం, నోముల మల్లేశం, పలుసం సతీష్, గరిసె రవి, వంగాల అశోక్, ఎస్ కె రసూల్, బద్దం సంజీవరెడ్డి, కంకల కిష్టయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల సమయానుకూలంగా బస్సులు నడపాలి



భువనగిరిటౌన్: వినతిపత్రం అందజేస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

భువనగిరిటౌన్ : వలిగొండ మండలం పులిగిల్ల నుంచి భువనగిరికి వచ్చే విద్యార్థుల సమయానుకూలంగా బస్సులు నడపాలని కోరుతూ ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో బుధవారం యాదగిరిగుట్ట డిపో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. వలిగొండ మండలం పులిగిల్ల, వీరవెల్లి, బండసోమవారం, చందుపట్ల, రామచంద్రాపురం, పెంచికల్‌పహాడ్ గ్రామాలకు ఒఏఆర్టీసీ బస్సు ఉందన్నారు. ఆ బస్సు కూడా ఉదయం, సాయంత్రం వేళ్లలో విద్యార్థుల సమయానుకూలంగా రావడం లేదన్నారు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థుల సమయానుకూలంగా బస్సు నడపడంతో పాటు ఆయా గ్రామాలకు మరొక బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో నాయకులు సురుపంగ చందు, దుర్గాప్రసాద్, సిరికొండ తేజ, కొండోజు రోహిత్, భాను, మణికంఠ, మహేష్ పాల్గొన్నారు.

రామన్నపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థుల సమయానుకూలంగా ఆర్టీసీ బస్సులను నడపాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్‌కుమార్ కోరారు. బస్సులను సకాలంలో నడుపాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం సంతకాలను సేకరణ నిర్వహించారు. అమ్మనబోలు, లక్ష్మాపురం, కక్కిరేణి రూట్లలో ఆర్టీసీ బస్సులను నడపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బత్తిని సందీప్, బూడిద ఆదిత్య, భూక్యా సంతోష్, యాదాసు కల్యాణి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

నిర్ణయించిన ధరలకే సిమెంట్, స్టీల్ విక్రయించాలి



మోత్కూరు : వ్యాపారులతో మాట్లాడుతున్న అధికారులు

మోత్కూరు : ఇందిరమ్మ ఇళ్లకు నిర్ణయించిన ధరలకే సిమెంట్, స్టీల్ విక్రయించాలని తహసిల్దార్ జ్యోతి, ఎంపీడీవో డి.బాలాజి, మున్సిపల్ కమిషనర్ కె.సతీష్‌కుమార్, అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సిమెంట్, స్టీల్ దుకాణదారులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. 53 గ్రేడ్ సిమెంటు బస్తా ధర రూ.280, 43 గ్రేడ్ బస్తా ధర రూ.260, స్టీల్ 12ఎంఎం కేజీకి రూ.53.50, టైల్స్, బాత్‌రూమ్, పూజా రూమ్‌ల ఎలివేషన్‌కు సంబంధించి రూ.195, ఫ్లోరింగ్ టైల్స్ రూ.40, రూ.35 చొప్పున విక్రయించాలని ధరలు నిర్ణయించినట్లు అధికారులు ప్రకటించారు. లబ్ధిదారుల నుంచి ఫిర్యాదుల కోసం 9390948039 టోల్ నంబర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ సి.వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసిల్దార్ ఉపేందర్, సిమెంటు, స్టీలు దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

నిర్ణయించిన ధరకే ఇసుక రవాణా చేయాలి

ఆత్మకూరు(ఎం): ఇందిరమ్మ ఇళ్లకు నిర్ణయించిన ధరలకే ఇసుక రవాణా చేయాలని ఎంపీడీఓ జె.రాములు నాయక్ అన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. మండల పరిధిలోని బిక్కేరు వాగు నుంచి ఆత్మకూరు(ఎం), కాప్రాయపల్లి, కొరటికల్, మొదుభావిగూడెం, పల్లె పహడ్‌కు, పారుపల్లి, పోతిరెడ్డిపల్లి, రాయిపల్లి, సారగండ్లగూడెం, సింగారం, టి.రేపాక, ఉప్పలపహడ్ గ్రామాలకు రూ. 1500 చొప్పున, మొదుగుకుంట, మొరిపిరాల, రహీంఖాన్‌పేట, సర్వేపల్లి, తిమ్మాపురం గ్రామాలకు రూ. 2000ల చొప్పున, కూరెల్ల, లింగరాజుపల్లి, పల్లెర్ల, పుల్లాయిగూడెం, రాఘవాపురం, తుక్కాపురం గ్రామాలకు రూ. 2500లకు చొప్పున ఇసుక సరఫరా చేయాలన్నారు. నిర్ణయించిన ధరల కంటే అధికంగా వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

కంప్యూటర్ బహూకరణ



పంచాయతీ కార్యదర్శికి కంప్యూటర్ అందజేస్తున్న దాతలు

రాజాపేట : మండలంలోని సోమారం గ్రామ పంచాయతీ కార్యాలయానికి కేశబోయిన నరేష్ కుమార్ , ధీరజ్‌లు బుధవారం కంప్యూటర్ కంప్యూటర్ బహూకరించారు. కార్యక్రమంలో కార్యదర్శి మౌనిక, చిన్నం బాలరాజు, బండ నరేష్, చిన్నం సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇందిరా మహిళా శక్తి సంబరాలు

ఆలేరు: ఆలేరు లో ఇందిరా మహిళా శక్తి సంబరాలను గురువారం నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ టి.నాగిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలేరు పట్టణంలో జరుగనున్న ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు చెందిన పొదుపు సంఘాలకు రూ.9.90కోట్ల వడ్డీలేని రుణాలతోపాటు లోన్ బీమా, ప్రమాదబీమా చెక్కులను అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు హాజరుకానున్నట్లు తెలిపారు.

కొనసాగుతున్న దీక్ష



దీక్షకు మద్దతు తెలుపుతున్న నాయకులు

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని దేశ్‌ముఖిలోని విజ్ఞాన్ యూనివర్సిటీకి చెందిన క్యారీలో పడి మృతిచెందిన బీటెక్ విద్యార్థి బొడ్డు శ్యామ్‌చరణ్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ చేపట్టిన రీలే నిరాహార దీక్ష బుధవారం కొనసాగింది. దీక్షకు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడియా రాజు మద్దతు తెలిపారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేస్తామని కళాశాల యాజమాన్యం హామీ మూడు నెలలు గడుస్తున్న పరిహారం ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి తీగుళ్ల శ్రీనివాస్, కిశోర్ పాల్గొన్నారు.

సర్వేయర్‌ను నియమించాలి

వలిగొండ : మండలానికి సర్వేయర్‌ను నియమించాలని సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి అన్నారు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ దశరథకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కందడి సత్తిరెడ్డి, కొండే కిష్టయ్య, మంగ బాలయ్య, కందగట్ల సాయి రెడ్డి, కంబాలపల్లి మల్లేశం, రైతులు నరసింహ, నాగయ్య, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు ప్రకటించాలి

మోత్కూరు : పెండింగ్ డీఏలు ప్రకటించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర క్రీడా కో కన్వీనర్ కొత్తకొండ శ్రీధర్ అన్నారు. బుధవారం మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 2023 నుంచి రావాల్సిన పీఆర్సీని డిమాండ్ చేశారు. జేఏసీలో ఉపాధ్యాయ సంఘాలతో చర్చించిన మేరకు ప్రభుత్వం వెంటనే హెల్త్ కార్డులను కేంద్ర ప్రభుత్వం (సీజీహెచ్ఎస్) మాదిరిగా అమలు చేయాలన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు సమ్మె కాలం జీతం చెల్లించి మినిమం టైం స్కేల్ వర్తింపజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మోత్కూరు మండల బాధ్యులు లక్ష్మారెడ్డి, నాగరాజు, అడ్డగూడూరు మండల ప్రధాన కార్యదర్శి పెండెం శ్రీనివాస్ పాల్గొన్నారు.

షరతులు లేకుండా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

ఆత్మకూరు(ఎం): ఎలాంటి షరతులు లేకుండా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉప్పల ముత్యాలు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జేఏఎస్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సీపీఐ మండల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి మారుపాక వెంకటేశం, సహాయ కార్యదర్శి ఎండి నయీం, కార్యవర్గ సభ్యులు కల్వల నర్సయ్య, జక్క దయాకర్‌రెడ్డి, సోలిపురం లింగారెడ్డి, గుర్ర రాజమణి, బొబ్బల లాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలేరులో ట్రాఫిక్ ఆంక్షలు

ఆలేరు : పట్టణంలోని రైల్వేగేట్ సమీపంలో ఆర్‌యూబీ పనులు కొనసాగుతున్నాయి. ఆర్‌యూబీ వాహనాల ప్రవేశ ద్వారానికి సంబంధించి పట్టణ రోడ్డు పక్కన రిటైనింగ్ వాల్ పనులు మొదలు పెట్టనున్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని ప్రధాన రోడ్డును మూసివేశారు. ఆలేరు మీదుగా హైదరాబాద్, వరంగల్ కు రాకపోకలు సాగించే భారీ వాహనాలను దారి మళ్లించారు. పట్టణంలోని హైదరాబాద్-వరంగల్ రోడ్డుకు అడ్డంగా ట్రాఫిక్ పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేశారు. దాదాపు ఇరవై రోజుల పాటు ఈ రోడ్డును మూసివేయనున్నట్లు ఆర్అండ్‌బీ జేఈ కరుణాకర్ తెలిపారు.

మంతపురి రోడ్డు మీదుగా ఎంట్రీ.. జీడికల్‌లో ఎగ్జిట్

హైదరాబాద్ నుంచి ఆలేరు, వరంగల్, జనగామకు వచ్చే భారీ వాహనాలు పట్టణంలోని వివేకానంద స్వామి విగ్రహం పక్క నుంచి మంతపురి రోడ్డు మీదుగా ప్రవేశించి, జీడికల్ అండర్‌పాస్ నుంచి ఎగ్జిట్ కానున్నాయి. వరంగల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే వాహనాలను ఇదే మాదిరి మళ్లించారు. ఆలేరు మీదుగా రఘునాథ్‌పురం, కొలనుపాక తదితర గ్రామాలకు వెళ్లే వాహనాలను మంతపురి మార్గంలోని రైల్వేఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) నుంచి దారి మళ్లించారు.

నేడు వార్డు ఆఫీసర్ కార్యాలయాలు ప్రారంభం

ఆలేరు : ఆలేరు పురపాలికలో ఏర్పాటు చేసిన వార్డు ఆఫీసర్ కార్యాలయాలు ప్రారంభానికి సిద్ధమయ్యాయు . గురువారం ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య 6వ వార్డు కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. మున్సిపాలిటీలో 12 వార్డుల్లో వార్డు అధికారుల కార్యాలయాలను ఏర్పాటు చేశారు. పారిశుద్ధ్యం, వీధి దీపాలు, తాగునీరు, రోడ్లు తదితర సమస్యలపై వార్డు కార్యాలయాల్లో ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించనున్నారు. వాటిని వార్డు అధికారులే వీలైనంత వరకు పరిష్కరిస్తారు.

హామీలు అమలు చేయాలి

గుండాల : ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 22న భువనగిరిలో తలపెట్టిన బహిరంగ సభను విజయవంతం చేయాలని హెల్పింగ్ సొసైటీ జిల్లా అధ్యక్షులు సింగారం రమేష్ కోరారు. బుధవారం మండలంలోని వెల్మజాల గ్రామంలో ఆ సంఘం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మధు, వెంకటయ్య, రాజేష్, ఉప్పలయ్య, లక్ష్మీనారాయణ, ప్రమోద్, కిష్టయ్య, రాజు, దేవయ్య, భిక్షపతి, సుగుణమ్మ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలి

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని రాంలింగంపల్లి గ్రామంలోని అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనాన్ని వెంటనే పూర్తి చేయాలని కోరుతూ బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ సత్యనారాయణరెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి కోట రాంచంద్రారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించి మధ్యలో వదిలేశారన్నారు. అధికారులు స్పందించి భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు మంచాల మధు, కోట అశోక్, బుగ్గ లక్ష్మయ్య, వడ్డేపల్లి యాదగిరి, లింగస్వామి, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

40వసారి రక్తదానం

మోత్కూరు : మండలంలోని పాటిమట్ల గ్రామానికి చెందిన మాతృదేవోభవ-పితృదేవోభవ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కురుమేటి నవీన్ బుధవారం రక్తదానం చేశారు. నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రిలో చిట్యాల గ్రామానికి చెందిన అమనగంటి మంగమ్మకు బి.పాజిటివ్ రక్తం అవసరం కాగా సమాచారం అందుకున్న నవీన్ ఆస్పత్రికి వెళ్లి రక్తదానం చేశారు. ఇప్పటి వరకు 40సార్లు రక్తదానం చేసినట్లు ఆయన తెలిపారు.



రక్తదానం చేస్తున్న కురుమేటి నవీన్

వర్షాలు కురవాలని పూజలు



బొడ్రాయికి జలాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

మోటకొండూర్: వర్షాలు కురవాలని కోరుతూ మండలంలోని చందేపల్లి గ్రామంలోని గ్రామ దేవతలకు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. శివాలయంలో శివలింగానికి, బొడ్రాయికి సామహిళలు జలబిందెలతో అభిషేకాలు నిర్వహించారు.

బస్సు పునరుద్ధరణ .. విద్యార్థుల సంబరం



విజయకేతనం చూపెడుతున్న విద్యార్థినులు

యాదగిరిగుట్ట : పట్టణంలోని పాత గోశాల సమీపంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బాలికల వసతి గృహానికి ఉన్న బస్సు సర్వీసును అధికారులు ఇటీవల రద్దు చేశారు. విద్యార్థులు ఇబ్బందులు పడుతుడడంతో బీజేపీ ఆధ్వర్యంలో ఇటీవల ధర్నా నిర్వహించారు. దీంతో స్పందించిన ఆర్టీసీ అధికారులు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సహకారంతో బుధవారం నుంచి రద్దు చేసిన బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించారు. దీంతో విద్యార్థులు సంబరాలు జరుపుకున్నారు. వసతి గృహ నుంచి పాఠశాలకు తీసుకెళ్లి, తిరిగి వసతి గృహానికి తీసుకువచ్చేందుకు ప్రత్యేక బస్సును ఏర్పాటు చేయడంపై వార్డెన్ సోని, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.